

బస్టాండ్‌ను సందర్శించిన ఆర్టీసీ డీఎం

మోమిన్‌పేట్, మే 17(ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్‌లోని బస్టాండ్‌ను శనివారం వికారాబాద్ ఆర్టీసీ డీఎం గడ్డం అరుణ సందర్శించారు. బస్టాండ్‌లో ప్రయాణికులు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని కంట్రోలర్ రాజును అడిగి తెలుసుకున్నారు. టైంప్రకారం బస్సులొస్తున్నాయా? ప్రయాణికులకు తాగునీటి వసతి ఉందా? అని అడిగారు. బస్టాండ్‌లో ఆటోల పార్కింగ్‌తో సమస్యలొస్తున్నాయని తెలుసుకొని షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ మనోహరచక్రవర్తితో మాట్లాడారు.

టీఎంఓపీ సర్వతోముఖాభివృద్ధికి కృషి

● తెలంగాణ రాష్ట్ర మీ సేవ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్‌ప్రసాద్




ప్రమాణ స్వీకారం చేస్తున్న టీఎంఓపీ కార్యవర్గ సభ్యులు

శామీర్‌పేట, మే 17(ఆంధ్రజ్యోతి): టీఎంఓపీ యూనియన్ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానని యూనియన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు బత్తుల జీవన్‌ప్రసాద్ అన్నారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఓ హోటల్‌లో శనివారం తెలంగాణ రాష్ట్ర మీ సేవ ఆపరేటర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో ఎన్నికైన రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. టీఎంఓపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బత్తుల జీవన్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దాస జగదీశ్వర్, ఉపాధ్యక్షులు వాసం భూమేశ్వర్, మల్లు కోటేశ్వరరావు, పనస చంద్రశేఖర్, గుండె యాదగిరి, శివకుమార్, నవీన్‌కుమార్, ప్రధానకార్యదర్శి కొత్త కిరణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా గఫూర్, నసీర్ అహ్మద్, పరిపూర్ణచారి, కె.అనిల్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మహేందర్, సతీశ్‌రెడ్డి, సాయిశాంతన్, సతీశ్, అనిల్‌కుమార్, కె.మహేశ్, కార్యనిర్వహక అధ్యక్షులుగా అశ్విన్‌గౌడ్, లక్ష్మీనారాయణ, డి.రాజు బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవరాన్ని రాఘవేందర్‌రావు మెమొంటో, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. జీవన్‌ప్రసాద్ మాట్లాడుతూ.. మీసేవ ఆపరేటర్ల ఆర్థిక అభ్యున్నతికి చేయూత నిస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు, రైతులకు అందిస్తున్న మీసేవ వ్యవస్థను మెరుగుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సేవలన్నింటినీ మీసేవల ద్వారానే అందించేలా సర్కారు విధానాన్ని రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు గోపి, గంగారెడ్డి, శ్రీనివాస్, రఫీకుర్ రెహ్మాన్, రతన్‌కుమార్, వివిధ అడ్వైజర్లు జయంతి, ప్రజ్వల్‌రెడ్డి, బల్వంతరావు, రాజేశ్వర్, మీడియా కన్వీనర్లు వేణు, సాగర్‌బాబు, వివిధ గ్రామాల మీ సేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు ఆయన మారుపేరు. వృత్తి అధ్యాపకుడు.. ప్రవృత్తి రచనలు. సామాజికాంశాలపై విశ్లేషణలతోపాటు, రచయితగా రాణిస్తున్నారు. పరిగి పట్టణానికి చెందిన డాక్టర్ పుసుపుల భాస్కరయోగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఆయనకు సాహిత్య పరిశోధకుడు, రచయిత నాగలింగ శివయోగి ప్రేరణ. ఆయన స్ఫూర్తితో విభిన్న పుస్తకాలు, మూల గ్రంథాలు, వ్యాఖ్యాన గ్రంథాలను సేకరించారు. అనంతరం ఆయన ప్రాచీన, ఆధునిక సాహిత్యాల అనుసంధానం దిశగా అధ్యయనం సాగించారు. సాహితీ అంశాలపై భాస్కరయోగి ప్రస్థానం ఆయన మాటల్లోనే..

- పరిగి, మే17 (ఆంధ్రజ్యోతి)



Sunday Special

వృత్తి బోధన.. ప్రవృత్తి రచన



గోరటి వెంకన్నతో భాస్కరయోగి(ఫైల్)

6

సామాజిక అంశాల విశ్లేషణలో దిట్ట

అనేక పత్రికలకు పలు శీర్షికలతో వ్యాస రచన

ఇప్పటి వరకు 25 పుస్తకాల ముద్రణ

రచయితగా రాణిస్తున్న భాస్కరయోగి

నీటి కటకట

8

● లాల్‌గడి మలక్‌పేట్‌లో 24 రోజులుగా నీటి సమస్య

● మిషన్ భగీరథ, పంచాయతీ అధికారుల సమన్వయ లోపం



వేతన వెతలు!

ప్రతీ నెల తప్పని ఎదురుచూపులు

- పౌర గ్రంథాలయ శాఖ ఉద్యోగులది దయనీయ స్థితి
- ఇప్పటి వరకు హైదరాబాద్ మినహా ఇతర ఏ జిల్లాలోనూ అందని ఏప్రిల్ జీతం
- 13 జిల్లాల్లో సిబ్బందికి ఇంకా రాని మార్చి నెల వేతనం
- ఆర్థిక ఇబ్బందులతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలు సతమతం

అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు వస్తున్నట్లు జిల్లా పౌర గ్రంథాలయాల ఉద్యోగులకు, సిబ్బందికి నెలనెలా వేతనాలు సక్రమంగా రాక వారు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని సగం జిల్లాల వారికి నెలనెలా ఒకటో తారీఖున వేతనాలు అందుతున్నా.. మరి కొన్ని జిల్లాల వారికి నెల, రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయి. అసలే తక్కువ వేతనాలతో పనిచేస్తున్న గ్రంథాలయ శాఖ ఉద్యోగులు, పెన్షనర్లు.. వచ్చే జీతమైనా సరిగ్గా రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే బిల్లులు చెల్లించక లైబ్రరీలకు దిన, వార పత్రికలు కూడా సరిగా రావడం లేదు.

వికారాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పౌర గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనం కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. కొన్ని జిల్లాల్లో గ్రంథాలయ శాఖ ఉద్యోగులకు నెలనెలా వేతనం అందుతున్నా.. సగం జిల్లాల్లో మాత్రం రెండు నెలలుగా నుంచి వేతనాలకు నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. గ్రంథాలయ శాఖ ఉద్యోగులు, పార్ట్‌టైం సిబ్బంది, పెన్షనర్లు మాత్రం వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని జిల్లాల్లో నెలనెలా వేతనం అందుతుంటే.. మరికొన్ని జిల్లాల్లోని ఉద్యోగులకు నెలనెలా సక్రమంగా ఇవ్వడం లేదు. రాష్ట్రంలో గ్రంథాలయ శాఖలో 316 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. 300 మంది స్వీపర్లు, 150 మంది పార్ట్‌టైం స్వీపర్లు పనిచేస్తున్నారు. 800 మంది వరకు రిటైర్డ్ ఎంప్లాయీస్, ఫ్యామిలీ పెన్షన్‌దారులున్నారు. ప్రభుత్వ, ఇతర స్థానిక సంస్థల ఉద్యోగుల ఖాతాల్లో ఒకటో తారీఖునే వేతనం జమవుతుంటే.. ఈ నెల 13వ తేదీ వరకు హైదరాబాద్ మినహా మిగతా 32 జిల్లాల్లో పనిచేస్తున్న గ్రంథాలయ శాఖ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఏప్రిల్ వేతనం అందలేదు. 13జిల్లాల వారికి మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలందాల్సి ఉంది. ఇప్పటి వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ, ములుగు, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల్, నిర్మల్, జగిత్యాల్, సిరిసిల్ల, కరీంనగర్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట్, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట్, గద్వాల్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది, పెన్షనర్లకు ఏప్రిల్ వేతనం రాలేదు. వికారాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, మహబూబాబాద్, సిద్దిపేట్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, మంచిర్యాల్ జిల్లాల్లోని వారికి ఏప్రిల్, మార్చి నెలల వేతనాలు అందలేదు. ఇదిలా ఉంటే.. బిల్లుల చెల్లింపుల ప్రభావం పత్రికలు, మ్యాగజైన్లు, కరెంట్ బిల్లులపై పడుతోంది. నెలనెలా బిల్లులు చెల్లించకపోవడంతో గ్రంథాలయాలకు పత్రికల సరఫరా నిలిచిపోతోంది.



రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను కలిసిన ఉద్యోగ సంఘం ప్రతినిధులు(ఫైల్)

ఒకటో తేదీన వేతనం వొట్టిమాటేనా..?!

ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా గ్రంథాలయ శాఖ ఉద్యోగులకు

మిగతా 8వ పేజీలో...

దయనీయంగా పెన్షనర్ల జీవనం..

నిత్యావసరాలు, పెరిగిపోతున్న ఖర్చులతో నెలల తరబడి వేతనం రాకుంటే కుటుంబాన్ని పోషించుకోవడం ఉద్యోగులకు కష్టతరం. నెలల తరబడి వేతనం రాక గ్రంథాలయ శాఖ ఉద్యోగుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. అలాగే ఉద్యోగ విరమణ చేసి కేవలం పెన్షన్ పైనే ఆధారపడే వారి పరిస్థితి దయనీయంగా మారింది. రిటైర్డ్ ఉద్యోగులు కుటుంబ పోషణతో పాటు వైద్యానికి, మందులకు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. నెలల తరబడి పెన్షన్ అందక పెన్షన్‌దారులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమాచారం

వికారాబాద్‌కు విద్యుత్ సామగ్రి స్టోర్

వికారాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాకు తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ నూతన ఎలక్ట్రికల్ స్టోర్‌ను కేటాయించింది. దీని వల్ల జిల్లాలో తలెత్తే విద్యుత్ సరఫరా సమస్యలకు మరింత వేగవంతమైన పరిష్కారం లభించనుంది. ఇప్పటి వరకు విద్యుత్ మరమ్మతులకు అవసరమైన సామగ్రిని హైదరాబాద్ నుంచి తెప్పించాల్సి వచ్చేది. ఇది ఆలస్యానికి కారణమై ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వికారాబాద్‌లోనే ఎలక్ట్రికల్ స్టోర్ ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు ఎప్పటి నుంచో కోరుతూ వచ్చారు. ఈ సమస్యను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలో 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో త్వరలో ఈ గోడౌన్ నిర్మాణం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, వికారాబాద్ ప్రజలు స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ అవైలెబుల్ స్కూళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పథకం కింద 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతి (డే స్కాలర్), ఐదో తరగతి రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత ఉన్న విద్యా సంస్థలు ఈ నెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. గుర్తింపు పొంది ఉండి ఆరేళ్లుగా ఏడో, పదో తరగతుల్లో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఉత్తీర్ణత సాధిస్తున్న విద్యా సంస్థలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు కలెక్టరేట్‌లోని ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఖాళీ స్థలాలు.. కబ్జాలపాలు!

ఘట్‌కేసర్‌లో అడుగడుగునా రోడ్ల ఆక్రమణలు

- రోడ్లపైనే దుకాణాల నిర్వహణ
- ఏళ్ల తరబడి ఆక్రమణలు
- వాహనదారులు, స్థానికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు



ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ గేట్ పక్కన ఆక్రమణలు

ఘట్‌కేసర్, మే 17(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో రోడ్ల పక్కన ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమించడం రాత్రికి రాత్రే షెడ్లు నిర్మించి అద్దెకివ్వడం, సొమ్ము చేసుకోవడం ఇక్కడి నాయకుల ఘనతగా మారింది. పట్టణంలో అడుగడుగునా రోడ్డు స్థలాలను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపట్టడం స్థానిక నాయకులకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది. ఘట్‌కేసర్‌లోని సబ్‌స్టేషన్ ప్రహరీని రోడ్డు మధ్య నుంచి 50 ఫీట్ల స్థలం వదిలి గోడ నిర్మించారు. రోడ్డుకు, ప్రహరీకి మధ్య ఉన్న స్థలంలో కొందరు రంగప్రవేశం చేసి ఆక్రమణలకు శ్రీకారం చూట్టారు. ఇక్కడ మరో విషయం ఏమంటే.. గోడ ఖర్చులు సైతం లేకుండా మూడు వైపులా గోడలు నిర్మించి నాలుగో దిక్కు సబ్‌స్టేషన్ గోడపైనే నిర్మాణాలు చేపట్టి దుకాణ సముదాయాలు(షటర్లు) నిర్మించారు. యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టి షటర్లను అద్దెకిస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులు గతంలో గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేశారు కూడా. అయినా ఏళ్ల తరబడి రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదు. ఘట్‌కేసర్‌లో ప్రధాన కూడలి అయిన అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న ముస్లింల ఖబ్రస్థాన్ ప్రహరీకి ఆనుకొని దుకాణాలువెలిశాయి. ఖబ్రస్థాన్ ప్రహరీ ఒకవైపు అక్రమ నిర్మాణాలు, మరోవైపు ఆటో పార్కింగ్‌లతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సివిల్ పోలీసులు గానీ, ట్రాఫిక్ పోలీసులుగానీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. అలాగే ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో ఉన్న ప్రభుత్వాసుపత్రి ప్రహరీకి ఆనుకొని ఐదేళ్ల క్రితం ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. దీంతో వాష్ రూమ్‌లను అసరాగా చేసుకొని కొందరు భారీ సంఖ్యలో దుకాణాలు వేసుకున్నారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నవుతున్నాయి. పోలీస్ స్టేషన్ రోడ్డు

మిగతా 8వ పేజీలో...



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఖబ్రస్థాన్ ప్రహరీ పక్కన వెలిసిన దుకాణాలు

రోడ్ల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం



ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డిరెడ్డి వంతెన వరకు 100 అడుగుల రోడ్డు మంజూరైంది. రోడ్డు నిర్మాణం కోసం ముగ్గు పోసిన అనంతరం ఆక్రమణలను తొలగిస్తాం. అలాగే ఎదులాబాద్ రోడ్డులో పలు చోట్ల వెలసిన ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రోడ్లను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వారిపై చర్యలు తప్పవు.

- భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ

ధాన్యం కొని రైతుల ఇబ్బందులు తీర్చాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు మొలకెత్తిన వడ్లను చూపుతున్న మహిళ

ఘట్‌కేసర్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా రైతులు సంతోషంగా లేరని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ పరిధి ఎదులాబాద్ లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. నెల రోజుల నుంచి ఇక్కడ హమాలీలు, బస్తాలు, ధాన్యం తరలింపు రవాణాసౌకర్యం లేక ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలకు రంగుమారిన, మొలకెత్తిన వడ్లను ఈటలకు చూపించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ.. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఎడ్చిన వ్యవసాయం బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు. ఎదులాబాద్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులను చూస్తే చాలా బాధేస్తోందన్నారు. రోజులతరబడి కేంద్రాల్లోనే మగ్గుతున్న రైతులను ఆదుకునే పరిస్థితి లేదని తెలిపారు. రైతులను ఇబ్బందులు పెట్టిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేదన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. వర్షాల దృష్ట్యా ధాన్యాన్ని త్వరగా తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిల్లలర్లు ఇష్టారాజ్యంగా వ్యహరిస్తున్నారని, సంచికి కిలో నుంచి రెండు కిలోల వంతున కట్ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా చూస్తాం : డీఆర్వో

ఘట్‌కేసర్ రూరల్/కీసర:కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. ఎదులాబాద్ కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఆమెతో డీసీఎంస్ డీఎం సుగుణబాయి, తహసీల్దార్ డీఎస్ రజని, ఏవో లావణ్య, అర్ఐ కావ్యారెడ్డి, ఎఈవో జగదీష్, సెంటర్ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు. అలాగే కీసరలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో ఉపేందర్‌రెడ్డితో కలిసి డీఆర్వో సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గన్నీ బ్యాగుల కొతర లేకుండా చూసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు చెప్పారు. ఆమె వెంట సొసైటీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ బుచ్చిరెడ్డి, తహసీల్దార్ అశోక్, రైతులు ఉన్నారు.



కీసర కొనుగోలు కేంద్రం వద్ద హరిప్రియ

మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి) : మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీ వర్గాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కుట్టు మిషన్లను అందజేస్తోందని వికారాబాద్ జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవి కుమార్ తెలిపారు. శనివారం తాండూరు మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరై ప్రసంగించారు. తాండూరు మున్సిపాలిటీకి 79కుట్టు మిషన్‌లు మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించి ఆర్పీలు, వార్డు ఆఫీసర్‌లు ఈ నెల 20లోపు డాక్యుమెంటేషన్ పూర్తిచేయాలని ఆయన కోరారు. కొడంగల్, వికారాబాద్, పరిగి మున్సిపాలిటీల్లో డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తయిందని, తాండూరు మాత్రమే మిగిలి ఉందని ఆయన చెప్పారు. మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.2లక్షల లోపు ఆదాయం, తెల్ల రేషన్ కార్డు, 18 నుంచి 55 మధ్య వయసు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులనే పరిశీలించాలని చెప్పారు. కార్యక్రమంలో టీఎంసీ రాజేంద్రప్రసాద్, కోఆర్డినేటర్ విశాల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా జిల్లా పీడీ రవికుమార్

వేడుకలు, బరాత్‌లకు నో డీజే

- ముగ్గురిపై కేసు నమోదు

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి): వేడుకలు, బరాత్‌లకు డీజే అనుమతి లేదని తాండూరు అర్బన్‌సీఐ సంతోష్ కుమార్ శనివారం తెలిపారు. పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రాత్రి సుమారు 1.30గంటల సమయంలో పట్టణంలోని సాయిపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా పెండ్లి వేడుకల్లో డీజే ఏర్పాటు చేయగా కుర్వ ఎల్లప్ప, డీజే సౌండ్ సిస్టమ్ యజమాని కుర్వ జగదీశ్, ఆపరేటర్ బుడగజంగం ఆదర్శ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● పదేళ్ల పాలనలో ఒక్క ఇల్లు ఇవ్వని బీఆర్ఎస్ ● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, మే17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, కేసీఆర్, అప్పటి ఎమ్మెల్యేలు మాత్రం పెద్ద భవనాలు నిర్మించుకొని పేదలను గాలికొదిలేశారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నమని, పైలెట్ గ్రామాల్లో బేస్‌మెంట్ వరకు కట్టుకున్న ఇళ్లకు రూ.లక్ష చొప్పున ఇచ్చామని తెలిపారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లి, తెట్టెకుంగ తండాలలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి భూమిపూజ చేసి అక్కడే ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా ఎక్లాస్‌ఖాన్‌పేట, బైర్కాన్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎక్లాస్‌ఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు హైదరాబాదులో నాలుగైదు భవనాలు నిర్మించుకున్నారని.. పేదలకు ఇళ్లు ఇవ్వడానికి వారికి చేతులు రాలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటలో గత పదేళ్లలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. త్వరలో అందరికీ రుణమాఫీ అవుతుందని భరోసా ఇచ్చారు.

పర్యటన సక్సెస్... ఆనందంలో కాంగ్రెస్ శ్రేణులు

ఎమ్మెల్యే పర్యటన సక్సెస్ కావడంతో కాంగ్రెస్ నాయకులు ఆనందంలో మునిగిపోయారు. ఎక్లాస్‌ఖాన్‌పేట మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ స్వగ్రామం కావడంతో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లికి ఘన స్వాగతం పలకడంలో నాయకుల మధ్య సమన్వయం కనిపించింది. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, తహసీల్దార్ ఆజంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, జగదీశ్వరప్ప, కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, యెన్నం శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, గిరిధర్ యాదవ్, రావుల పెంటయ్య, రూప్లానాయక్, శ్రీను నాయక్, యాదగిరిచారి, చేవెళ్ల నర్సింలు, అబ్బి సుందరయ్య, ఇబ్రహీం, కోడూరు రాములు, తైద పర్వతాలు, సురేష్ మాదిగ, భీమయ్య మాదిగ, చెన్నయ్య, పురుషోత్తంరెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాణి, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఎక్లాస్‌ఖాన్‌పేటలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వృత్తి బోధన.. ప్రవృత్తి రచన

● సామాజిక అంశాల విశ్లేషణలో దిట్ట
● అనేక పత్రికలకు పలు శీర్షికలతో వ్యాస రచన
● ఇప్పటివరకు 25 పుస్తకాల ముద్రణ
● రచయితగా రాణిస్తున్న భాస్కరయోగి


డాక్టర్ భాస్కరయోగి రచించిన పుస్తకాలు

పరిగి, మే 17: ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఇమ్మడిజెట్టి చంద్రయ్య వంటి వారి ప్రభావం, గోరేటి వెంకన్నతో సాన్నిహిత్యం భాస్కర యోగిని అధ్యాయనం, పరిశోధనల వైపు నడిపించాయి. ఆయన పాలమూరు జిల్లా సంకీర్తనా సాహిత్యంపై పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా తీసుకున్నారు. ఈ పరిశోధన ద్వారా జిల్లాలోని అజ్ఞాత, విస్మృత కవులు 150 మంది చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చారు. అలాగే రాష్ట్రంలోని 330 మంది కవుల చరిత్ర తెలంగాణ పద సంకీర్తనలను రచించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పుస్తకం ముద్రించారు. అనేక కారణాలతో విస్మరణకు గురైన ఇక్కడి కవులు, సాహితీవేత్తల జీవిత చరిత్రలు తెలంగాణ ఆవిర్భావం అనంతరం వెలుగులోకి వస్తున్నాయి.

వ్యాస రచనతో మంచి పేరు

మొదట్లో పత్రికల్లో అడపాదడపా వ్యాసాలు రాయడాన్ని ప్రారంభించారు. దానికి స్థిరమైన రూపం రావడం లేదని భావించి 2016 నుంచి భాస్కర వాణి పేరుతో ఒక దిన పత్రికకు వ్యాసాలు రాశారు. అదే సమయంలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో పరంజ్యోతి శీర్షికకు ఆధ్యాత్మిక కథనాలు రాశారు. ప్రతికల్లో రాసిన 60 వ్యాసాల సంకలనం ఫోర్త్ ఎస్టేట్‌గా ప్రచురితమైంది. వ్యాస రచనతో పాటు ఆధ్యాత్మిక ప్రసంగాలు ఆయనకు మంచి పేరు తెచ్చాయి. వివిధ పత్రికలలో మాటకు మాట, కొక్కొరోకో, వర్తమాన భారతం తదితర శీర్షికలతో వ్యాసాలు రాస్తున్నారు.

నాటి పాల్కురికి నుంచి నేటివరకు

నాటి పాల్కురికి నుంచి నేటి వరకు సాహితీ సేవను, తెలంగాణ సమాజానికి వారు చేసిన కృషిని పరిశోధించి తెలంగాణ సాహిత్య సౌరభాలు పేర ఓ గ్రంథాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని ఇప్పడికే తెలుగు అకాడమీ ముద్రించింది. ఆయన యాదాద్రి క్షేత్రంలో సంకీర్తన కవిగా ఉన్న ఈగ బుచ్చిదాసు సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని కూడా తెలంగాణ సాహిత్య అకాడమీ ముద్రించింది. వేపూరి హనుమద్దాసు చరిత్రను 2017 డిసెంబరులో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆవిష్కరించారు. ఆ సభల్లో వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న, ప్రముఖ పాటల రచయితలు సుద్దాల అశోక్, చంద్రబోస్ తదితరులు నిర్వహించిన గేయ తత్వకమిటీలో భాస్కరయోగి భాగస్వామిగా ఉన్నారు. మొత్తంగా ఇప్పటి వరకు విభిన్న అంశాలపై ఆయన రచించిన 25 పుస్తకాల వరకు ముద్రితమయ్యాయి.


మనపండుగల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి (ఫైల్)

సాహిత్యాన్ని మానవీయ దృష్టితో చూడాలి



సాహిత్యాన్ని మానవీయ దృష్టితో చూడాలి. వర్ధమాన కవులు అధ్యాయనం, అనుశీలనంపై దృష్టి సారించాలి. సిద్ధాంత విభేదాలను పక్కన పెట్టి అన్ని రకాల సాహిత్యాలను అధ్యాయనం చేయాలి. సంకుచిత దృష్టిని విడనాడాలి. చాలా మంది తత్వకవులు, వారి పేర్లను కూడా రాసుకోలేదు. అలాంటి వారిపై ఆధునిక పరిశోధకులు దృష్టి పెట్టాలి. ఎక్కడో ఇతర దేశాలకు చెందిన కవుల గురించి రాస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మనవాళ్లను పట్టించుకోవడం లేదు. సమాజాన్ని ప్రభావితం చేసిన వేపూరి హనుమద్దాసు, దున్న ఇద్దాసు లాంటి వారిని మనం విస్మరిస్తున్నాం.

-భాస్కరయోగి, రచయిత

వారంలోగా ధాన్యం డబ్బుల చెల్లింపు


చింతపట్లలో మహిళా రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ సూర్యారావు

యాచారం, మే 17(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వారం రోజుల్లో డబ్బు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు డీఆర్డీఏ ఏపీడీ పి.సూర్యరావు వెల్లడించారు. వర్షానికి ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. శనివారం మండలంలోని చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు దారులు, రైతులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రతీ రైతుకు టార్పాలిన్ అందిస్తున్నామని. మండలాల్లోని వ్యవసాయశాఖ కార్యాలయాల్లో, రైతు వేదికల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఏపీడీ తెలిపారు. అదేవిధంగా మహిళా రైతులకు గ్రీన్‌హౌస్ నిర్మాణం కొరకు 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. రెండు, మూడు ఎకరాల భూమి కలిగిన ఉన్న మహిళా రైతులకు గ్రీన్‌హౌస్ నిర్మాణం కోసం విరివిగా రుణాలందించి ఆదుకుంటామన్నారు. ఐకేపీ ఏపీఎం సాంబశివుడు, సీసీలు గణేష్, నర్సింహ, స్వరూప, రాజు తదితరులు ఉన్నారు.

కృష్ణస్వామికి జీవన సాఫల్య పురస్కారం


అవార్డు అందుకుంటున్న కృష్ణస్వామి

చేవెళ్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): తల్లారం గ్రామానికి చెందిన కవి దుబ్బాకుల కృష్ణస్వామికి సాహిత్యంలో చేసిన సేవలకు గాను జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈనెల 16న నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్తంగా నిర్వహించిన అజరామరం చారిత్రక పద్య నాటకం, అనంత ద్వితీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు బి.రాఘవేంద్రచార్యులు, తదితరులు కృష్ణస్వామికి జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. కృష్ణస్వామి మాట్లాడుతూ సాహిత్యంలో చేసిన సేవలకు ఈ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

వైభవంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో శనివారం బొడ్రాయి పున:ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈసందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.


పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

మాజీ బిల్ కలెక్టర్ రిమాండ్

ఘట్‌కేసర్‌రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులను దుర్వినియోగానికి పాల్పడిన మాజీ బిల్‌కలెక్టర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. 2021-2022లో నాటి సర్పంచ్ సురేష్, కార్యదర్శి ఉష, బిల్‌కలెక్టర్ రజినికర్‌రెడ్డిలు గ్రామపరిధిలో వివిధ రూపాల్లో వచ్చిన పంచాయతీ నిధులు రూ.17 లక్షల25వేల నగదును వారి సొంతానికి వాడుకున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో నాటి డీపీవో పద్మజారాణి విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగం అయినట్లు తేల్చారు. ఈ మేరకు అప్పటి కార్యదర్శి మల్లారెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేశారు. ఈ మేరకు రజినికర్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తునట్లు సీఐ పరశురాం తెలిపారు.

క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు

- వైద్యాధికారి తీరుపై విమర్శలు

పరిగి,మే 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శనివారం పరిగిలోనిపలు ప్రైవేట్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు క్లినిక్‌లు నిబంధనలకువిరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడం, కనీస అర్హత లేకుండా క్లినిక్ నిర్వహించడంపై డీఎంహెచ్‌వో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అనంతరం పరిగిలోని కొడంగల్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో కూర్చునిఅక్కడికి ఆర్ఎంపీలను రప్పించి బేరసారాలు సాగించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నవారంతా సదరు అధికారిని మేనేజ్ చేసినట్లు విమర్శలు వెల్లువెత్తాయి.

యూనిఫాం సకాలంలో అందజేయాలి


డ్రెస్‌లు కుట్టే కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వికారాబాద్ జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. శనివారం ఆయన టీఎంసీ రాజేంద్రప్రసాద్, కో-ఆర్డినేటర్ విశాలతో కలిసి సాయిపూర్, మల్‌రెడ్డిపల్లిలో డ్రెస్‌లు కుట్టే కేంద్రాలను పరిశీలించారు. ఈఏడాది 6, 7 తరగతుల విద్యార్థులకు ఫుల్‌డ్రెస్‌లు కుట్టిస్తున్నట్లు ఆయన చెప్పారు. అంతకుముందు ఆర్పీలు మెప్మాకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

పెట్టుబడిదారుల కోసమే అందాల పోటీలు

ఇబ్రహీంపట్నం, మే 17 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారుల లాభాలకోసమే అందాల పోటీలు నిర్వహిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య ఆరోపించారు. వివిధ దేశాల సుదరీమణులు శనివారం రామోజీ ఫిలిం సిటీ వచ్చిన సందర్భంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తుగా సీపీఎం నాయకులను అరెస్టు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా అందాల పోటీలు అవసరమా అంటూ యాదయ్య ప్రశ్నించారు. అందాల పోటీలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని మహిళల అభ్యున్నతికోసం ఈనిధులు ఖర్చు చేస్తే బాగుండేదని ఆయన అన్నారు. పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసిన వారిలో ఐద్వా నాయకురాలు మస్కు అరుణ, సీపీఎం నాయకులు సామేల్, జగన్, ఎల్లేష్ తదితరులున్నారు.

ప్రభుత్వంపై బీజేపీ నాయకుల తప్పుడు ప్రచారం

● ఎంపీ మల్లు రవి


మాట్లాడుతున్న మల్లు రవి

ఆమనగల్లు, మే 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచి రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు సమన్వయంతో ముందుకు సాగుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అద్భుత ప్రగతి సాధిస్తుంటే బీజేపీ నాయకులు జీర్ణించుకోలేక కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం విలేకరుల సమావేశంలో మల్లు రవి మాట్లాడుతూ బీజేపీ శాసన సభ పక్ష నాయకుడు మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, మంత్రివర్గ విస్తరణను సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్నారని అనడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోని బీజేపీలో తీవ్రమైన వర్గపోరు కొనసాగుతోందని.. అందుకే చాలా కాలంగా బీజేపీ అధ్యక్ష ఎంపిక వాయిదాపడుతూ వస్తుందన్నారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని అన్నారు. బీజేపీ నాయకులు గోబెల్స్ వారసులని, అబద్ధాల పునాదుల మీదనే వారి రాజకీయ జీవితం ఉందని మల్లు అన్నారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, కాలె మల్లయ్య, శ్రీను నాయక్, పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు కోల్పోయిన సబితారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం, మే 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కును ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఏనాడో కోల్పోయారని, పదే పదే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కానీ, పార్టీ నాయకులను గానీ విమర్శిస్తే సబితారెడ్డి చేసిన మోసాలను కరపత్రాల రూపంలో బహిర్గతం చేయాల్సి వస్తుందని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నడికూడ శివ, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సబితాఇంద్రారెడ్డికి రాజకీయ భిక్షపెట్టిన కాంగ్రెస్‌తో పాటు నమ్ముకున్న నాయకులను, కార్యకర్తలను నట్టేట ముంచి అధికార దాహంతో బీఆర్ఎస్ చేరిందని.. సబితారెడ్డి గతాన్ని మర్చిపోవద్దని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో భూ కబ్జాలు చేస్తూ ఆగడాలు చేసిన అనుచరులతో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డిపై లేనిపోని ఆరోపనలు చేయించడం ఎంతవరకు సమంజసమన్నారు. దేప భాస్కర్‌రెడ్డి పుణ్యమా అని కాంగ్రెస్‌లో గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన సబితాఇంద్రారెడ్డి కాంగ్రెస్ నాయకులను, ప్రభుత్వాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగభృతి, దళితులకు 3 ఎకరాలు భూమి, దళిత ముఖ్యమంత్రి వంటి హామీలు అమలు చేయలేదని, పదేళ్ల రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా మింగిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను ప్రశ్నించే హక్కు ఏమాత్రం లేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమాత్రం అమలు చేశారో ఎమ్మెల్యేగా సబితారెడ్డి ఆలోచించాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ, నాయకులు అల్లె కుమార్, ప్రవీణ్, మంత్రి బాల్‌రాజ్, యాదయ్య, ఐ. నర్సింహ, భిక్షపతి, జావేద్, రాజు, లాజర్, సుభాష్ పాల్గొన్నారు.

నీటి కటకట

- లాల్‌గడిమలక్‌పేట్‌లో 24రోజులుగా తీరని నీటి సమస్య
- మిషన్ భగీరథ, పంచాయతీ అధికారుల సమన్వయలోపం
- జాడలేని ప్రత్యేకాధికారి


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు(ఫైల్)

మూడుచింతలపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో కొద్ది రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. బిందెడు నీటి కోసం అష్టకష్టాలు పడాల్సివస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రైవేటు ట్యాంకర్లను తెప్పించుకుని తాగడానికి, ఇతర అవసరాలను తీర్చుకుంటున్నామని తెలిపారు. ఒక్కో నీటి ట్యాంకర్‌కు రూ.800చొప్పున వెచ్చించి నీరు తెప్పించుకుంటున్నారంటే గ్రామంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పలు సార్లు మిషన్ భగీరథ, పంచాయితీ కార్యదర్శికి తమ సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నీటి సమస్యపై ప్రత్యేక అధికారికి విన్నవించగా సొంతంగా ట్యాంకర్ తెచ్చుకోవాలని చెప్పారని వాపోయారు.

24రోజుల నుంచి తాగునీటి తంటాలు

లాల్‌గడిమలక్‌పేట్‌లోని కింద బస్తీలో సుమారు 60 కుటుంబాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. భగీరథ నీటిసరఫరా నిలిచిపోతే గ్రామ పంచాయితీ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. విసిగెత్తిన గ్రామస్తులు కొద్ది రోజుల కిందట ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారుల్లో మాత్రం చలనం లేకపోవడం గమనార్హం. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు సమన్వయ లోపంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేస్తే నీటిసరఫరా అవుతుందని అధికారి దృష్టికి తీసుకెళ్లగా గ్రామ పంచాయితీల్లో నిధులు లేవని, రూ.15వేలు ఎవరిస్తారంటూ గ్రామస్తులపైనే ఆగ్రహం వ్యక్తంచేయడం విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు.

24 రోజులుగా నీరు రావడం లేదు



గత 24రోజుల నుంచి తాగు నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ప్రైవేటు ట్యాంకర్లు తెప్పించుకుని అవసరాలు తీర్చుకోవాల్సివస్తోంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటంలేదు. - ఈశ్వరమ్మ, లాల్‌గడిమలక్‌పేట్

అధికారులు పట్టించుకోవడం లేదు



లాల్‌గడిమలక్‌పేట్‌లోని కింది బస్తీలో 20రోజుల నుంచి తాగునీరు సరఫరా కావడం లేదని పలుసార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు. బిందెడు నీటి కోసం పడరానిపాట్లు పడుతున్నాం. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. - పెంటమ్మ, లాల్‌గడిమలక్‌పేట్

మా దృష్టికి రాలేదు

లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో నీటి సమస్య ఉందని మా దృష్టికి రాలేదు. వస్తే చూస్తాం. ఒకవేళ నీటి సమస్య ఉంటే గ్రామపంచాయితీ ట్రాక్టర్ల ద్వారా నీటిని అందిస్తాం. - వినూత్నరెడ్డి, ప్రత్యేకాధికారి

నీటి సమస్య వాస్తవమే

లాల్‌గడి మలక్‌పేట్ గ్రామంలోని కొన్ని ఇళ్లకు నీరు సరఫరా కాకపోవడం వాస్తవమే. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. - స్వాతి, మిషన్ భగీరథ ఏఈఈ

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కులకచర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(24) ఉద్యోగం కోసం ప్రయత్నం చేయగా రాకపోవడంతో అప్పుచేసి ఆటో కొనుగోలు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపోషణ భారం కావడంతో శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బొంరాస్‌పేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. దుప్‌చర్ల వాగు నుంచి శనివారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్న టీఎస్ 34 ఏ 1922 నెంబరు గల ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- కేంద్రం వద్ద రైతుల ఆందోళన


తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కులకచర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో మండలంలోని కుసుమ సముద్రం గ్రామరైతులు శనివారం కులకచర్ల చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పది రోజుల కిందట గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్యలు కలిసి ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి కొనుగోలు చేసిన ధాన్యం కేవలం ఒకేఒక్క లారీ లోడ్ వెళ్లిందని రైతులు తెలిపారు. అనంతరం లారీల కొరత కారణంగా కొనుగోళ్లు నిలిపివేశారని, దీంతో కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సివస్తోందని తహసీల్దార్ ఎదుట వాపోయారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న బొంపల్లి గ్రామస్థులు

దోమ, మే 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని బొంపల్లి గ్రామస్థులు అన్నారు. బొంపల్లిలో గత 20రోజులుగా నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో బీపీఎల్ రైజర్స్ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో బొంపల్లి వారియర్స్ నిలిచింది. విజేతకు రూ.10వేలు నగదు బహుమతిని గ్రామానికి చెందిన ఆర్.అంతిరెడ్డి అందించగా, ద్వితీయ బహుమతిని గుడిసె రాములు ముదిరాజ్ రూ.5వేలు అందజేశారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ముదిరాజ్ మెమోంటోలను అందజేశారు. క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ రాములు, కానిస్టేబుల్ సురేశ్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

వేతన వెతలు!

(ఐదోపేజీ తరువాయి)

మాత్రం ఒకటో తేదీన వేతనం అందడం లేదు. ఒక్క హైదరాబాద్‌లో మాత్రం ఆశాఖ ఉద్యోగులు నెల నెలా వేతనాలు పొందుతుంటే.. జిల్లాల్లో మాత్రం వేతనాలకు ఎదురుచూపులు తప్పడం లేదు. పౌర గ్రంథాలయ శాఖ ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు చెల్లింపులు చేస్తున్నా అందరు ఉద్యోగువలె మొదటి తేదీన వేతనం రావడం లేదు. తమకూ ప్రతీ ఒకటో తేదీన వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రంథాలయ శాఖ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా ఆచరణలో ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని పౌర గ్రంథాలయ శాఖ ఉద్యోగులు, పెన్షనర్లు వాపోతున్నారు. నెలనెలా వేతనం సక్రమంగా అందక రుణ వాయిదాలను చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హౌసింగ్, ఇతర వ్యక్తిగత రుణాల ఈఎంఐలను ఎలా చెల్లించాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని, ఈఎంఐలకు సైతం మరిన్ని అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. నెలనెలా వేతనం సక్రమంగా వస్తేనే కుటుంబ పోషణ కష్టతరంగా మారిన ఈ పరిస్థితుల్లో నెలల తరబడి వేతనం చెల్లించకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

పౌరగ్రంథాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ ఉగ్యోగుల సంఘం రాష్ట్ర నేతలు రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర గ్రంథాలయ సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చాగంటి అయోధ్య, సభ్యులు నరసింహారెడ్డి, యాదయ్య, యూనియన్ హైదరాబాద్ కార్యదర్శి వరప్రసాద్‌లు గత శుక్రవారం హైదరాబాద్‌లో సందీప్‌కుమార్ సుల్తానియాను కలిసి ఉద్యోగుల సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. గ్రంథాలయ ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని వారు ఆయనను కోరారు.

నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం


అనురాగ్ సెట్ టాపర్లను సత్కరిస్తున్న సూర్యదేవర నీలిమ

ఘట్‌కేసర్ రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని అనురాగ్ యూనివర్శిటీ సీఈవో సూర్యదేవర నీలిమ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం అనురాగ్ సెట్ టాపర్లకు ఆమె జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లా అనురాగ్, అడిషనల్ డైరెక్టర్ మహిపతి శ్రీనివాస్‌రావు, మల్లేష్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలు.. కబ్జాలపాలు!

(ఐదో పేజీ తరువాయి)

స్థలంలో దుకాణాలు నిర్వహిస్తున్నారు. అక్కడి నుంచి కొద్ది దూరంలోనే బొక్కోనిగూడ చౌరస్తా, ఎన్‌ఎఫ్‌సీనగర్ చౌరస్తాలోనూ రోడ్లను ఆక్రమించారు. ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ వద్ద, అంబేద్కర్ చౌరస్తాలో కొందరు నాయకులే రోడ్లను ఆక్రమించి అద్దెకిచ్చారు. పట్టణంలో ఎక్కడ చూసినా రోడ్లను ఆక్రమిస్తున్నాఅధికారులు పట్టించుకోవడం లేదు. నాయకుల ఒత్తిళ్లు, బెదిరింపులతో పట్టించుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇళ్ల తొలగింపునకు సహకరిస్తారా?

ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. ఇటీవల యంనంపేట్ చౌరస్తా నుంచి ఎలిమినేటి మాధవరెడ్డి బ్రిడ్జి వరకు 100ఫీట్ల రోడ్డు నిర్మాణానికి సాంకేతిక అనుమతులొచ్చాయి. సబ్‌స్టేషన్ నుంచి బస్‌స్టాండ్ వరకు ఆక్రమణలు, కొన్ని ఇళ్లను తొలగించాలి. ఆక్రమణల తొలగింపు సులభమే అయినా అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రోడ్డు వెడల్పులో ఇళ్లను తొలగించాలి. 1997లో ఇళ్లు కోల్పోయిన వారికే నేటికీ పరిహారం చెల్లించలేదు.. మళ్లా కూల్చివేతలకు ఇళ్ల యజమానులు సహకరిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి. రైల్వే బ్రిడ్జి పనులూ నత్తనడకన సాగుతున్నాయి. అంబేద్కర్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి బ్రిడ్జి వరకు కాకుండ అంబేద్కర్ విగ్రహం నుంచి బైపాస్ వరకు గల ఎదులాబాద్ రోడ్డును అభివృద్ధి చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని స్థానికులు చూచిస్తున్నారు. పాత జాతీయ రహదారి, అంబేద్కర్ విగ్రహం నుంచి ఎన్‌ఎఫ్‌సీనగర్ చౌరస్తా వరకు రోడ్డు ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి


రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏఈవో

కొడంగల్, మే 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో భూమి కలిగిన రైతులు వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో ఐసాక్ హెరాల్డ్ తెలిపారు. శనివారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతుల వివరాలను నమోదు చేశారు. రైతులు తమ వివరాలను నమోదు చేసుకుంటే రైతు విశిష్ట సంఖ్యను కేటాయించనున్నట్లు తెలపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను పొందడం సులభమవుతుందన్నారు.

డీబీటీ యంత్రాల పంపిణీ

కొడంగల్, మే 17 (ఆంధ్రజ్యోతి): పర్సాపూర్ రైతు వేదికలో ఫర్టిలైజర్స్ దుకాణ డీలర్లకు డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) యంత్రాలను శనివారం అందజేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని ఫర్టిలైజర్స్ దుకాణ డీలర్లు 90 మందికి కోరమండల్ ప్రతినిధులు శ్రీకాంత్, రమేశ్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పీఏసీఎస్ చైర్మన్ కే.శివకుమార్‌గుప్త యంత్రాలు అందించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పూడూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగడి చిట్టంపల్లి గ్రామంలోని ఆలయంలో శివపార్వతుల కల్యాణం శనివారం జరిగింది. కల్యాణంలో భక్త రాజయ్య దంపతులు కూర్చుని శివపార్వతుల నిర్వహించారు. పురవీధుల్లో కల్యాణమూర్తుల పల్లకీసేవ కొనసాగింది. అనంతరం రవిగౌడ్ దంపతులు అన్నదానం చేశారు.

అలియాబాద్‌లో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన

శామీర్‌పేట: అలియాబాద్‌లోని జనార్ధన్‌నగర్ చేనేత కాలనీలో గ్రామ నాయకులు నూతనంగా నాగదేవత ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో శనివారం నాగదేవత నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీ పరిగి మండల అధ్యక్షురాలిగా అనసూయ


అనసూయను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

పరిగి, మే 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పరిగి మండల అధ్యక్షురాలిగా,రూప్‌ఖాన్‌పేట్ మాజీ సర్పంచ్ నీరటి అనసూయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నియమాకపత్రాన్ని అందుకున్నారు. అనసూయసుదర్శన్‌ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.రాముయాదవ్, మల్లేశ్, బాలకిష్టారెడ్డి, కె.శ్రీశైలం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు ఎస్‌ఐ ఆకస్మిక బదిలీ

తాండూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రమేష్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. కొంత కాలం కిందట ఇక్కడ పని చేసిన రమేష్‌ను తక్కువ సమయంలో బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈ స్థానచలనం జరిగినట్లు పోలీస్ బలగాలు పేర్కొంటున్నాయి. రాజకీయ కోణంలోనే బదిలీ జరిగి ఉండవచ్చని పలువురు అంటున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ప్రొబేషనరీ ఎస్‌ఐ విట్టల్

దుద్యాల, మే 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ప్రొబేషనరీ ఎస్‌ఐ విట్టల్ అన్నారు. శనివారం దుద్యాల మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ ముత్తురాజ్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


పెద్దమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

ఘట్‌కేసర్, మే 16 ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో గల పెద్దమ్మతల్లి కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు ధనలక్ష్మి, బాల్‌రెడ్డి, హరిప్రసాదరావు, నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, శేఖర్, రాజేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి

ఘట్‌కేసర్ రూరల్: యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. అవుశాపూర్‌లో కంద కట్ల దయాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన మహాకార్ సర్వీసింగ్ సెంటర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్‌గౌడ్, భిక్షపతిగౌడ్, బొడిగే శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ రమేశ్‌కు సత్కారం

కులకచర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ రమేశ్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్ తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

అనాథ విద్యార్థులకు ఉచిత విద్య

తాండూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): తాండూరు చైతన్య జూనియర్ కళాశాలలో అనాథ విద్యార్థులకు ఉచితంగా, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఫీజులో రాయితీ కల్పిస్తూ ఇంటర్ విద్యను అందిస్తామని కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తాండూరు నియోజకవర్గంలోని వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు.

రెవెన్యూ సదస్సులకు 74 దరఖాస్తులు


రెవెన్యూసదస్సులో దరఖాస్తులుదారులు

ధారూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగోపుల, మైలారం, నాగ్‌సాన్‌పల్లి గ్రామాల్లో శనివారం అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో 74 దరఖాస్తులు అందాయి. తరిగోపులలో అత్యధికంగా 63 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, శ్యాంసన్, దీపక్, డీటీ విజయేందర్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

మోమిన్‌పేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమని ఏహెచ్‌టీయూ బృందం హెడ్‌కానిస్టేబుల్ అలీ మోద్దీన్ అన్నారు. వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఏహెచ్‌టీయూ బృందం శనివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆర్టీసీ కంట్రోలర్ రాజుతో కలిసి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే, ఇబ్బందులకు గురి చేస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఆడ పిల్లలకు చిన్న వయసులో పెళ్లిలు చేయరాదన్నారు.

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి


సమీక్షిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్‌రెడ్డి

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న సంక్షేమ ఇతర పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నరేందర్‌రెడ్డి సూచించారు. ఆయన తన చాంబర్‌లో శనివారం వార్డు ఆఫీసర్లతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, సోషల్ ఎకానామిక్ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 19లోపు సోషల్ ఎకనామిక్ సర్వేను మిగిలిన వార్డులలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వార్డు ఆఫీసర్లు యాదగిరి, గోపాల్, నర్మద, రాఘవేందర్‌రెడ్డి, భువనేశ్వరి, సంజీవ్ కుమార్, బొప్యా, రాములు ఉన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం

శామీర్‌పేట, మే 17 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడమే అఫ్జల్ ఫౌండేషన్ ధ్యేయమని వ్యవస్థాపకుడు మహ్మద్ అఫ్జల్‌ఖాన్ అన్నారు. శామీర్‌పేట గ్రామంలోని తన నివాసంలో ఇక నుంచి ప్రతి ఆదివారం తాను నూతనంగా నెలకొల్పిన అఫ్జల్‌ఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద, నిరుపేదలకు అన్నదానం చేయనున్నట్లు తెలిపాడు.

మండల వ్యవసాయ అధికారిగా లావణ్య

ఘట్‌కేసర్ రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా లావణ్య శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఏ బాసిత్ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు బదిలీపై వెళ్లగా, లావణ్య అక్కడి నుంచి ఘట్‌కేసర్ మండలానికి బదిలీపై వచ్చారు. ఘట్‌కేసర్ మండలంలో ఏడేళ్లుగా వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన బాసిత్ రైతుల మన్ననలు పొందాడు. లావణ్య శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎదులాబాద్, మాదారం, ప్రతాప్‌సింగారంల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలి

తాండూరు, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలను ఎలాంటి షరతులు లేకుండా మంజూరు చేయాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. రుణాల కోసం దరఖాస్తు చేసిన వారందరికీ బ్యాంకులతో సంబంధం లేకుండా, స్థానిక రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అర్హులైన ప్రతీ దరఖాస్తుదారుడికి ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు.

అందుబాటులో టార్పాలిన్లు


మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి

మూడుచింతలపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని రైతులు ధాన్యం తడవకుండా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని జగ్గంగూడ సంపన్‌బోల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తేవాలన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవాబుపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట తహసీల్దార్ జయరాం జన్మదిన వేడుకల సందర్భంగా శనివారం నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు సన్మానించారు. కేక్ కట్ చేసి పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, మాజీ ఉపసర్పంచ్ శివరాజ్, నాయకులు జాన్‌చంద్రం, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భద్రేశ్వర దేవాలయంలో అన్నదానం

తాండూరు, మే 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వరాలయంలో తాండూరు పట్టణానికి చెందిన బీదర్ రాజశేఖర్ అన్నదానం చేశారు. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో మృతి చెందిన వారికి, వీరమరణం పొందిన జవాన్లకు ఆత్మశాంతి చూకూరాలని స్మరిస్తూ రాజశేఖర్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ యువ దళ్, వీరశైవ సమాజం, భద్రేశ్వర దేవాలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

పొలాలకు బాట కల్పించండి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెద్దేముల్, మే 17 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లేందుకు బాట కల్పించాలని నాగులపల్లి గ్రామ రైతులు మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన కోడుగంటి రాములు, సాయిని నాగిరెడ్డి పెద్దేముల్ తహసీల్దారు వెంకటేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పొలాలకు వెళ్లడానికి ఉన్న పానాది బాటను ఓవ్యక్తి మూసి వేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పొలాలకు వెల్లడానికి చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు.

రాహుల్‌గాంధీపై బీహార్ సీఎం వ్యాఖ్యలు సరికాదు


నిరసన వ్యక్తం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పట్ల బీహార్ సీఎం నితీష్‌కుమార్ వ్యవహరించిన తీరు సరైంది కాదని మర్పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. నితీష్‌కుమార్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో శనివారం నిరసన వ్యక్తం చేసి బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు నిఖిల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నందుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.